
# రేపటి వెలుగు

—ఆదూరి వెంకట సీతారామమూర్తి



'నాతో తెచ్చిన వెలుగును నాతోనే తీసుకు పోతున్నాను — మళ్ళీ రేపే పునర్దర్శనం' అన్నట్టు పడమటి కొండల మాటుకు పోతున్నాడు సూరీడు — పూర్తిగా చీకటి జొరబడకముందే నీరెండ మిగిల్చిన కొద్దిపాటి వెలుగులోనూ దినచర్యను ముగించుకోబోయే ప్రయత్నంలో వున్నాయి ప్రాణులు.

బారులు బారులుగా ఆకాశంలో గూళ్ళకు పోయే పక్షులు — పశువుల మందల్ని వూళ్ళోకి తోలుకుపోయే పాలికాపులు.

సరిగ్గా అదే సమయంలో అడ్డురోడ్డు దగ్గర బస్సుదిగి, ఊరివైపు నడుస్తున్నాడు పావనమూర్తి. అతని బుర్రలో ఎన్నో ఆలోచనలు దూరి మనసును పాడుచేస్తున్నాయి — ఒకప్రక్క యేదో చెయ్యాలనే తపన - ఏం .చేయాలన్నా ధైర్యం కావాలి. అదే లేదు తనకు. రెండు నెలల క్రితమే రిటైరైపోయాడు తను. అప్పట్నించీ పది రోజులకోమారు పెన్షన్ కాగితాలకోసం పట్నం వెళ్ళివస్తూనే వున్నాడు.

మట్టిరోడ్డు దిగి కాలిబాట పట్టాడు పావనమూర్తి. ఆ దారంటే రెండు ఫర్లాంగులు నడిస్తే పెద్ద చెరువు వస్తుంది. ఆ గట్టుగుండా నడిచి అటు దిగితే... అక్కడ్నించి దూరం తెలియదు.

నీరెండ తగ్గిపోయింది. ఊడలమర్రి దగ్గరకు వచ్చేసరికి గొల్లుమని ఏడ్పులు విన్పించేయి పావనమూర్తికి. ఆ యేడ్పులు ఆ ప్రక్కనే కొద్ది దూరంలో వున్న గుడిశలోనివి.

అనాదినుండీ అక్కడి పాకలు వూరికి దూరంగా వెలివేసినట్టే విసిరివేయబడ్డాయి — సుమారొక యాభై గుడిశలుంటాయక్కడ. అందులో నివసించేవారిలో యే కొద్దిమందో తప్ప తతిమ్మావారంతా యే రోజు కూలి ఆ రోజు సంపాదించుకుని బ్రతుకుతున్నవారే.వారిజీవనంతో గాని, కష్టసుఖాలతోగాని ఆ వూరి ప్రజలకెట్టి సంబంధమూ లేదు — కానీ ఎన్నికలొచ్చినపుడు మాత్రం అక్కడా గుర్తులు 'వెలుస్తాయి; మైకులు మార్మోగుతాయి — అప్పడే ఆ వూరి పెద్దలు ఆ వాడ గడపలు తొక్కేది! వారిని బతిమాలి, బుజ్జగించి, ఆశపెట్టి నచ్చచెప్పేది — ఓటున్న మనుషులుగా గుర్తించేది.

ఏడ్పులు మరింత అధికం కావడంతో పావనమూర్తికి అడుగు ముందుకు పడలేదు. ఒక్క క్షణం ఆగి, అటువంక చూశాడు. జనం గుంపులుగా అటువైపే వస్తున్నారు.

విషయాన్ని తేలికగానే గ్రహించగలిగాడు పావనమూర్తి. ఒక వ్యక్తి భుజం మీద దేనినో మోస్తున్నాడు — ఆ వెనుక దీనవదనాలతో కొందరు; అమాయకంగా మరి కొందరు.

ఆడవాళ్ళంతా గుడిసెలు దాటి కాస్త దూరమొచ్చి అక్కడ ఆగిపోయారు. తాటిపెండికివతల వున్న గోర్జి దిగి నడుస్తున్నారు జనం. ఆ దారి తిన్నగా ఊడలమర్రి వెనుకనున్న స్మశానం ప్రక్కగా వెళ్తుంది —

'ఏంది బాబయ్యా యీ దిక్కొచ్చారూ' పావనమూర్తి వెంటనే సమాధానం చెప్పలేదు — అగ్రకులస్థులు అటు వైపుగా రావటం వారికి ఆశ్చర్యమే మరి !

'పట్నమెళ్ళి వస్తున్నానోయ్' అని కాస్సేపాగి; 'ఏం జరిగిందిట—' అంటూ గుంపు వైపు చూశాడు. . .

'పాపం...కోటయ్య...కొడుకు పోనాడండీ— రెండేళ్ళుంటాయి— నిన్నటిదాకా ఆడుతూ పాడుతూన్న వోడే— యేటొచ్చిందో మరి పొద్దోయి కళ్ళు తేలేసేడు— ఆడికిక బిడ్డలు నిలవరు బాబయ్యా. యాడాది క్రితమొకడూ, మూడేళ్ళ క్రితమొకడూ వరసాగ్గా మగపిల్లలే పోనారు. ఇక్కడందర్లోకీ కాస్తో కూస్తో వున్నాడు వాడేనయ్యా. భార్య బంగారబ్బొమ్మ. ముత్తెల్లాంటి ముగ్గురు బిడ్డలూ వరసాగ్గా పోడంతో ఆయమ్మ శోకదేవతే అయిపోనాది. అసలు మాలో వుండాల్సిన ముడిసికాదండాయమ్మ. పసిపాపడంటే పేనం పెడతాది— ఏట్నాబం ? ఆయమ్మ ఆపద ఆదుకోలేంది. అదుగోనండి ఆ ఎదురు దడిపక్కనున్న ఎత్తరుగుల వాసపిల్లే కోటయ్యది.'' అంటూ మరో ప్రశ్నకి తావివ్వకుండా ఉన్న ఉదంతాన్ని పూసగుచ్చినట్టు చెప్పేడు పోలిగాడు.

అప్పటికే అక్కడ జనం కొద్దిగా పోగై వింతగా వింటున్నారు.

ముందుకు కదిలేదు పావనమూర్తి. అడుగులు ముందుకు పడుతూంటే ఆలోచనలు కడలి అలల్లా లేస్తున్నాయి. ఆ అలల మధ్య తేలియాడే నురుగుల జ్ఞాపకాలలో అతనికి తన కొడుకు రూపం ఒక్కమారు కన్పించి అదృశ్యమైపోయింది.

'చక్రధరం తిరిగి వస్తే బావుణ్ణు' అనుకున్నాడు పావనమూర్తి. వాడు యిల్లు వదిలి అప్పడే నాల్గునెలలయి పోయింది. ప్రాణాలతో వుంటే మాత్రం ఎప్పటికైనా తిరిగొస్తాడనే నమ్మకముంది. తనలోని చివరి వూపిరిపోయే ముందు గుక్కెడు తులసి తీర్థం వాడి చేతుల మీదుగా తన నోట జారితే అంతేచాలు !

చక్రధరం గురించి తల్చుకుంటేనే పావన మూర్తిలో ఎన్నో భయాందోళనలు— 'అసలు వాడలా మారటానికి తను కాదూ కారణం.' అనుకుంటాడు ఎప్పటికప్పుడు — తనను తనే తిట్టుకుంటాడు. దండించుకుంటాడు — పశ్చాత్తాపంతో దగ్ధమౌతాడు — ఆ తర్వాత బాధ్యతల బరువుల్లోంచి తప్పించుకోలేనివాడు తల దించుకుని వీధిన పడతాడు.

తన బ్రతుకు భారాన్ని తానే మోయాడ్వలేక యీడిగిలపడుతున్న వాడి మెడకొక బండరాయను కట్టడం మహాపాపం గదూ ? ఆ పాపమే తను చేశాడు. కూతురి జీవితం కోసం కొడుకు బ్రతుకును బలిపెట్టిన దౌర్భాగ్యుడతను

చక్రధరం నిజానికి ఎంత తెలివైనవాడో, అంత యోగ్యుడు. ఈ దేశంలో తెలివికీ, యోగ్యతకీ గౌరవముండివుంటే చక్రధరానికి ఉద్యోగం వచ్చి వుండేది.

చక్రధరం బియ్యే ఫస్టుక్లాసులో పాసైనవుడు ఎంత సంతోషించాడు తను. ఒక సెకెండరీగ్రేడు మాష్టారిగా దారిద్ర్య జీవితాన్నే గడిపిన తను తన కొడుకు గొప్పవాడు కావాలని ఆశించడంలో తప్పేముంది ? ఆ ఆశతోనే సాగలేకపోయినా డిగ్రీవరకూ చెప్పించాడు. అయితే దేశ సౌభాగ్యాన్ని పాఠాలలోనే బోధించే తనకు విభిన్న సమస్యలతో కొట్టుకులాడిపోతున్న దేశ ఆర్థిక స్థితిగతులుగాని, యువతలో చెలరేగిన అశాంతిగాని అవగతం కాలేదు.

''దండాలు బాబుగారూ. యీయాళప్పుడొస్తుంటే ఎవరో అనుకున్నా.''

తలతిప్పి చూచాడు పావనమూర్తి. ఎదురుగా దానయ్య.

''బావున్నావా దానయ్యా. ఏవిటి సంగతులు.''

''ఏముందయ్యా. మా కులపోళ్ల మీటింగెడితే పోయొస్తున్నా. మా కులాన్ని కూడ వెనకబడిన జాబితాలోకి చేర్చమని ప్రభుత్వానికి కాయితాలు పెట్టుకున్నాం. మునుపున్న మంత్రిగారు తప్పకుండా చూస్తామని వాగ్దానం చేసేరు. కానిప్పుడు మంత్రులు మారిపోయారుగా. అంచేత మీటింగ్ పెట్టి కొత్తగా కాయితాలు పంపిస్తన్నాం. మీలాటోళ్ల దయవల్ల ఆ పని సక్రమంగా జరిగింది. మా రెండోవోడికి వుద్యోగం దొరికేసినట్టే.''

పావనమూర్తి మరేం ప్రశ్నించలేదు. దానయ్య తనకంటే ఏ విధంగా వెనుకబడ్డవాడో ఆలోచిస్తున్నాడు. దానయ్యకు అంతో యింతో వ్యవసాయముంది. రెండు గేదెలూ, ఒక ఎడ్లజతా వున్నాయి, ఊళ్లో రెండు మిద్దె యిళ్లువున్నాయి. అందులో ఒకటి అద్దెకు కూడ యిచ్చేడు. చదువాబ్బేసాగని పెద్దకొడుకుచేత పట్నంలో ఒక పేస్సీకొట్టు పెట్టించేడు. ఇప్పుడు కుల ప్రాతిపదిక మీద రెండో కొడుక్కి సులభంగా ఉద్యోగం సంపాదించాలనే ఆరాటంలో వున్నాడు.

''మరి నేనెళ్లొస్తానండి బాబుగోరూ. మా ఆకరి కుర్రాడికి ఇంగ్లీషు ముక్కలు అసలు రాకండా వున్నాయి. తమ కాడికి పంపాలనుకుంటున్నాను'' అన్నాడు దానయ్య.

'అలాగేలే' అంటూ యింటి ముఖం పట్టేడు పావనమూర్తి.

అప్పటికి చీకటి పడింది. గుడిసెల్లో గుడ్డిదీపాలు వెలుగుతున్నాయి— బీదా బిక్కీ అయిన కొందరు రామ కోవిల అరుగుమీదికి చేరి పంచాయితీ రేడియోలో వచ్చే కార్యక్రమాల్ని వింటున్నారు.

పరుగుపరుగున వచ్చి అమాంతంగా ముందుకాళ్ళను వాటేసుకున్న మనుమరాల్ని చూసి అవాక్కయ్యాడు పావనమూర్తి. ఆ అమ్మాయి ముఖంలో భయం; ఆ అడుగులలో తడబాటు కన్పించాయతనికి.

'ఏమైందమ్మా' అడిగాడు లాలనగా తల నిమురుతూ. చల్లగాలి తాకి వర్షించిన మేఘంలా ఆ అమ్మాయి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆ చిన్ని ముఖంలోని దైన్యం; పోషణ లేని జుట్టు; మాసిన గౌనూ ఆ యింటి దారిద్రానికి ప్రతీకలుగా కన్పించాయతని కళ్ళకు.

'ఏం జరిగింది తల్లీ' అన్నాడు మళ్ళీ; వంగి ఆ చిరుగెడ్డాన్ని పట్టుకు వూపుతూ.

ఆ చిన్ని గుండెలో ఘనీభవించిన భయం లాలనతో కరిగింది.

'మరేమో... మరేమో... అమ్మ మంచం మీంచి లేవటంలేదు తాతయ్యా' అంది. పావనమూర్తి గుండెలు దడదడలాడేయి. ఏ సమస్యకైతే తను తట్టుకోలేడని భయపడుతున్నాడో అదే ఎదురౌతూంది. మనుమరాలి చెయ్యి పట్టుకుని వడివడిగా అడుగులు ముందుకు వేశాడు.

వీధి తలుపు తోసుకుని యింట్లోకి అడుగు పెట్టిన పావనమూర్తికి గదిలోంచి జానకి మూలుగు స్పష్టంగా విన్పించింది. ఇల్లంతా దరిద్రంతో నిండినట్టు చీకటిగా వుంది.

దీపం వెలిగించి కోడలున్న గదిలోకి నడిచాడు. కాళ్ళు వేలాడుతున్న కుక్కిపట్టె మంచం మీద బాధతో విలవిల్లాడిపోతూంది జానకి.

ఒక్క క్షణం ఆమెవంక చూసి 'ఎలా వుందమ్మా జానకీ' అన్నాడు.

ఆమె కళ్ళలో నిండిన నీళ్ళు చెంపలమీదుగా జాల్వారాయి తప్ప సమాధానం లేదు.

అంతవరకూ తన కాళ్ళను చుట్టేసుకుని నిల్చుని తల్లి ముఖంలోకి వింతగా, భయంగా చూస్తున్న మనుమరాల్ని ఎత్తుకుని యివతలికి వచ్చేశాడు పావనమూర్తి.

'బొత్తిగా మరో మనిషి సాయంలేని యిల్లయిపోయింది' అనుకున్నాడు. పాతికేళ్ళు తనతో కాపురం చేసి కొన్ని బాధ్యతల్ని మోయకుండానే స్వర్గస్తురాలైన భార్య గుర్తుకొచ్చిందతనికి.


ఆమే వుంటే తనీరోజు యిలా కళవళపడేవాడా ? ఎవరి అవసరం లేకుండానే కోడలి పురుడు ఆమె చేతులమీదుగా పోసేది !

ఆమే వుంటే కొడుకు తననిలా అన్యాయం చేసి వెళ్ళివుండేవాడా ?

బాధ్యతల్నీ; బరువుల్నీ ఎవరికివారు తప్పించుకుని తలో విధంగా వెళ్ళిపోతే చేతగానివాడిలా మిగిలిపోయాడు తను.

కానీ... సుఖాల ననుభవించినా కష్టాలకు తట్టుకుని జీవితాన్ని సరిదిద్దుకునేవాడే నిజమైన మనిషంటారు. పరిస్థితులకు జడిసి తనెప్పుడూ జీవితంనుండి పారిపోలేదు. పారిపోలేదుకూడా

గుమ్మందిగి వీధిలోకి నడిచాడు పావనమూర్తి. రామకోవిలదగ్గర సైకిల్తో రామం ఎదురయ్యాడు. రామం పావనమూర్తి శిష్యుడు అంచేత సంకోచించకుండా వున్న విషయం చెప్పి 'నువ్వీపని చేసిపెట్టాలోయ్' అన్నాడు.



'అదేమిటి మాష్టారూ యీ మాత్రం చేయలేనా. మరో అరగంటలో అమృతవల్లిగారు మీ యింట్లో వుండేట్టు చేస్తాను. సరేనా' అంటూ సైకిలెక్కాడు.

పావనమూర్తి కళ్ళు చెమ్మగిల్లాయి. రాముం ఆ క్షణాన దేవుడిలా అన్పించాడాయనకు.

అమృతవల్లి ఆ చుట్టుపక్కల గ్రామాలలో మంత్రసానిగా పేరుపొందింది. ఆమె భర్తకూడా హోమియో వైద్యుడు — ఓ చిన్న మోటర్ సైకిల్‌మీద గ్రామాలు తిరుగుతూ అక్కడి ప్రజల అవసరాల్ని ఆదుకుంటూ తద్వారా పొట్ట పోషించుకుంటున్నాడు.

పెద్ద చదువులు చదివి, డాక్టర్లై విదేశాలకుపోయి స్వదేశ ప్రజలకు ఉపయోగపడని వారి కంటె యిటువంటివారే ప్రజలకు కావల్సింది అని పావనమూర్తి చాలమార్లు చాల సందర్భాలలో అనుకున్నాడు.

ఆలోచనలతో యిల్లుజేరిన పావనమూర్తికి గడపలో చాపమీద సొమ్మసిల్లి పడుకున్న మనుమరాలు కన్పించేసర్కి మనసు కలుక్కుమంది.

'ఆగస్టు నెలలో పుట్టింది కాబట్టి పాపకు స్వరాజ్యం అని పేరు పెడదాం' అన్నాడు చక్రధరం అది పుట్టగానే — ఆ పేరే ఖాయమైంది.

స్వరాజ్యమంటే చక్రధరానికెంత ప్రేమ? తండ్రి పక్కలో పడుకుంటేనేగాని నిద్రపోయేది కాదు స్వరాజ్యం — అటువంటిది... కాలం మనుషుల్ని ఎలా మార్చేస్తుంది!

వరండాలోవున్న క్రరకుర్చీలో కూలబడ్డాడు పావనమూర్తి.

గదిలోంచి జానకి మూలుగు వినిపిస్తూనే వుంది.

"అమ్మలక్కొంట్లో ఎలగుంది బాబూ' అంటూ వచ్చి, 'ఆ మాలచ్మి పోడంతో యింటో మరో ఆడదిక్కే లేకపోయింది. పెద్ద కులపోళ్లు మీరు — మాలాటోళ్ళం ఏం చేయగలం' అని నొచ్చుకుంది ముత్యాలమ్మ.

'మనిషిని మనిషి ఆదుకుందికి కులాలేం అడ్డొస్తాయి ముత్యాలమ్మా. మంత్రసానికెటూ కబురంపాను. అవసరమైతే నిన్ను కేకేస్తాలే' అన్నాడు.

ముత్యాలమ్మ వెళ్లిపోయాక గుర్తొచ్చింది పావనమూర్తిని స్వరాజ్యం ఏమీ తినకుండా పడుకుందని. లోపలికెళ్లి గ్లాసుతో పాలు తెచ్చి స్వరాజ్యాన్ని లేపి తాగించాడు.

గదిలో జానకి చాలా బాధపడుతోంది. తను లోపలికెళ్లి యేంచెయ్యలేడు — వెళ్లకుండా వుండనూలేకపోతున్నాడు.

'కాస్త తమాయించుకోతల్లీ — అమృతవల్లికి కబురు పంపేను. మరికాస్సేపట్లో రావొచ్చు.' అని, జానకి ముఖంలోకి చూడలేక, వచ్చి కుర్చీలో కూలబడ్డాడు.

# రేపటి వెలుగు

దృష్టి వీధిలోకే వున్నా ఆలోచనలు మాత్రం ఎక్కడెక్కడో వున్నాయి.

ఐదేళ్లక్రితం వుండే యింటి పరిస్థితులకీ యిప్పటికీ ఎంత తేడా? హాయిగా ఉద్యోగం చేస్తూ నెలకిన్ని జీతపురాళ్లను తెచ్చుకునేవాడు. ఇంట్లో మహాలక్ష్మి 'లేద'నకుండా సంసారం చక్కదిద్దుకునేది. చక్రధరం కాలేజీకి వెళ్తున్నా, వసంత తల్లి వెనుక పనిపాట్లు చేసుకుంటున్నా చూడముచ్చటగా వుండేది!

ఆర్థికపరమైన యిబ్బందులు మనుషుల జీవనగతినే మార్చేస్తాయని వసంత పెళ్లి నిరూపించింది. కాకపోతే వసంత పెళ్లి కోసం ఉద్యోగమూ, సద్యోగమూ లేక నిరుత్సాహంగా రోజులు వెళ్లబుచ్చే చక్రధరం మెడకు బలవంతంగా గుదిబండ తగల్చడమేమిటి? ఇది మనుషులలో పేరుకుపోయిన పశుత్వానికి నిదర్శనం కాదూ?

"నన్ను కని, పెంచి, చదువు చెప్పించి యింతవాడిని చేసినందుకు నేను మీకు ఏ విధంగానైనా సాయపడాలి. ఉపయోగపడాలి కాదనను. కానీ నాకూ కలలూ ఆశలూ ఆశయాలూ వుంటాయి. జీవితంలో అనుకున్నవి సాధించాలనే తపన వుంటుంది. జీవితానికో ఆధారం బతుక్కో గమ్యం వెదుక్కుని మనిషిగా నాకాళ్లపై నేను నిలబడాలనే అతి సామాన్యమైన వూహ వుంటుంది. ఆ వూహలు నిజం చేసుకోడానికీ, ఆ ఆశలు సాధించుకోడానికీ నాక్కొంత వ్యవధి కావాలి — ఆ పైన మీ యిష్టం" అని తెలివిగా తప్పించుకోజూశాడేగాని తమ నిర్ణయాన్ని వ్యతిరేకించలేదు చక్రధరం. కట్నం యిచ్చి పుచ్చుకునే సందర్భంలో తల్లి దండ్రులు చేసే మానవ హోమాన్ని ఆపుజేసే ప్రయత్నమూ చెయ్యలేదు.

అప్పట్లో చక్రధరం వ్యతిరేకించి వుంటేనే బావుండేదనిపించింది.

ఆ తర్వాత చాలా మార్లు — అన్ని వేలు కట్నం పోసినా వసంతకు అతిసామాన్యమైన భర్తే లభించాడు. అన్ని వేలు కట్నం తీసుకొచ్చినా తన కోడలు ఓ నిరుద్యోగికి భార్యగానే మిగిలిపోయింది.

చక్రధరం ఎంత తెలివైన వాడో అంత సున్నిత మనస్కుడు. అంతే చురుకుదనం కలిగిన వాడు. కానీ నిరుద్యోగం; బలవంతంగా నెత్తిని రుద్దబడ్డ బాధ్యతలూ; ఆర్థిక అసమర్థత అతడిని అన్ని విధాలా మొద్దును చేశాయి.

ఉత్సాహంగా మెరిసే ఆ కళ్ళలో క్రమంగా దైన్యం, బాధ చోటు చేసుకున్నాయి. ఒక్కోసారి ఎర్రగబడి క్రోధాగ్నులను కురిపించేవి. అప్పటికే పరిస్థితులకు పూర్తిగా లొంగిపోయాడు చక్రధరం. కనీసావసరాలకు కూడ నోరు తెరిచి డబ్బు అడిగేవాడు కాదు. తల్లి పోయాక అతడిలో మరింత నైరాశ్యం చోటు చేసుకుంది. మితంగా మాట్లాడ్డం; యింట్లో వున్న సమయంలో ఏవేవో పుస్తకాలు చదవడం... అంతే!

రాన్రాను తనూ చక్రధరం నుండి తప్పించుకు తిరగడం అలవాటు చేసుకున్నాడు. ఒక్కొక్కప్పుడు వాడిని చూస్తే జాలి కంటె భయం ఎక్కువ కలిగేది. చదువు, తెలివితేటలూ వుండి కూడ సమాజం చేత మోసగింపబడి చిన్నచూపు చూడబడ్డ యువకులు విప్లవకారులు గానో, రాజకీయ హంతకులు గానో మారిపోగల ప్రమాదముందని ఎవరో చెప్పగా విన్నాడు.

చక్రధరం అలా ఎన్నటికీ కాడన్న ధైర్యం మనసులో వున్నా ఎక్కడో ఏదో శంక... ఏదో భయం!

భయపడ్డంతా జరిగింది చివరకు. ఏదో పని మీద పట్నం వెళ్ళిన చక్రధరం తిరిగి రాలేదు. మూడో రోజు తన పేర్న ఉత్తరం వచ్చింది.

నాన్నా!

ఒక సహృదయుడికి కొడుకుగా; ఒక ఉత్తమురాలికి చేతగాని భర్తగా; ఒక పసిదానికి ప్రేమ తప్ప మరేమీ యివ్వలేని తండ్రిగా; సంఘంలో పనికిరాని విద్యావంతుడిగా; వెలివేయబడ్డ అగ్రకులస్తుడిగా ఒక నిరుద్యోగిగా యీ జీవితమనే నాటకంలో నా పాత్రను పోషించలేక అందులో యిమడలేక, సతమతమౌతూ కాస్సేపు విశ్రాంతి కోసం వెళ్తున్నాను. మిమ్మల్ని బాధపెడితే క్షమించండి.

— చక్రధరం

చక్రధరం మీదికి ఆలోచనలు పోయినప్పుడల్లా ఆ ఉత్తరాన్ని తీసి చదువుకోడం అలవాటు చేసుకున్నాడు పావనమూర్తి. ఒక్కోసారి ఒక్కో విషయం స్ఫురిస్తుందదులో — ఒక్కోమారు ఒక్కో సమాధానం దొరుకుతుంది. కొన్నాళ్ళకైనా తిరిగివచ్చి జీవితంలోని తన పాత్రను నిర్వహిస్తాడనే ఆశ చిగురిస్తుంది.

ఇంటిముందు మోటర్‌సైకిల్ ఆగినప్పుడైతే ఆలోచనల్నుంచి బయటపడి లేచాడు పావనమూర్తి. అమృతవల్లి, ఆమె భర్త లోపలికొచ్చారు.

'ఎలావుంది ఆవిడకు' అడిగింది అమృతవల్లి.

జానకి వున్న గది వైపు వేలు చూపించాడు పావనమూర్తి. మందుల పెట్టెతోసహా ఆమె అటువైపు కదిలింది. అప్పటికి రాత్రి పదిన్నర — ఊరంతా మాటుమణిగిపోయి నిశ్శబ్దంగా వుంది. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ దూరంగా ఎక్కడో నక్కల అరుపులు... దగ్గరగా జానకి ప్రసవవేదన —

మరో అరగంటలో అమృతవల్లి బయటకు వచ్చింది.

"కవలలు మాష్టారూ ఇద్దరూ మగపిల్లలే" అంది.

ఆమె ఆశించిన సంతోషం పావనమూర్తి ముఖంలో విరియలేదు.

'జానకి ఎట్లా వుంది' అడిగాడు అతినెమ్మదిగా.

'అమ్మాయి చాల బలహీనమవడంవల్లనే కాన్పు కష్టమైంది — మరో గంట వరకూ ఆమెకు స్పృహ రాకపోవచ్చు -- ఆ తర్వాతకూడ మగత వుంటుంది. మరేం కంగారు లేదు. అంతవరకూ పిల్లల్ని మీరు చూసుకోగలిగితే చాలు' అంటూ చెప్పవలసినవన్నీ చెప్పి; చేయవలసినదంతా చేసిందామె.

ఆమె చూపించిన ఆత్మీయతకు; ఆదుకున్న తీరుకు పావనమూర్తి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. లోపలికెళ్ళి పర్సులో దాచిన పాతిక రూపాయిలూ ఆమె చేతిలో వుంచాడు.

'అవసరానికి ఆదుకున్నావు. ప్రస్తుతానికిది వుంచమ్మా. నీకు రావల్సినదేమైనా వుంటే కొద్ది రోజుల్లో సర్దుబాటు చేస్తాను' అన్నాడు.

పావనమూర్తి కంఠంలోని జీరతోకూడిన వణుకు ఆమె గమనించి చకితురాలైంది.

'అదేమిటి మాష్టారూ — డబ్బులో ఏముంది ? — సాటి మనిషిగా నాకు చేతనైనది నేను చేశాను. పెద్ద డాక్టర్లలా ఫీజులు వసూళు చేయడానికి నాకున్న డిగ్రీలేమిటి ?' అంది.

పావనమూర్తికి మాటలు కరువయ్యాయి. చేతులు రెండూ జోడించి ఆ దంపతులకు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఆ క్షణంలో వారిద్దరూ ఆదిదంపతుల్లా కనిపించారాయన కళ్ళకు.

దేశానికి స్వాతంత్ర్య మొచ్చి ముప్పది అయిదేళ్ళు దాటినా కనీసావసరమైన వైద్య సదుపాయం కూడ లభించని పల్లెలెన్నో వుండి పోయాయి. అటువంటి పల్లెల్లో అమృతవల్లి వంటివారే పల్లెవాసుల పాలిట అమృతమూర్తులౌతున్నారు. ఆధునిక వైద్య పరికరాలూ; సరికొత్త మందులూ లేకపోయినా ఉన్న కొద్దిపాటి విజ్ఞానంతోనూ, అనుభవంతోనూ ప్రజలను ఆదుకుంటున్నారు.

సంతృప్తిగా నిట్టూర్చి మంచంమీద నడుం వాల్చాడు పావనమూర్తి.

అప్పటికి అర్ధరాత్రి దాటింది. కడుపులో యేదో ఖాళీగా వెలితిగా అన్పించింది. మధ్యాహ్నం మూడింటికెప్పుడో హోటల్లో తాగిన కాఫీనీళ్ళు తప్ప లోపలికి మరేం పోలేదు.

లేచి, కాసిన్ని మజ్జిగతాగి, వస్తూ జానకి పడుకున్న గదిలోకి తొంగి చూశాడు — అచేతనంగా నిద్రిస్తోందామె. ఆమె పక్కలో ఆ చిన్ని వెలుగులో... బంగారు రంగులో... చిన్ని దేవుళ్ళలా లోకమెరుగని తన మనుమలు !

తన వంశాన్నుద్ధరించి, విస్తరింపజేసి గౌరవ ప్రతిష్టలను కాపాడగల రేపటి వెలుగులు !!

తిరిగివచ్చి, యథాస్థానంలో నడుం వాల్చేడు పావనమూర్తి. కొద్ది గంటలక్రితం మనసులో వుండే వ్యాకులతపోయి ప్రశాంతత ఏర్పడింది. దానిక్కారణమైన అమృతవల్లికి మనసులోనే మరోమారు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

మొదట్లో అమృతవల్లి హరిజనస్త్రీట. అతను నిజమైన క్రిష్టియను — ఎక్కడ్నుంచి వచ్చారో ఎప్పుడు వచ్చారో ఆ ప్రాంతానికి ఎవరికీ తెలియదు. క్రమంగా ఆమె అతని మతాన్నే స్వీకరించింది. తన మతంలో లేని భద్రత, విలువ అందులో వుందని తలపోసిందేమో మరి ! ఏ మతమైతేనేం ? ఇద్దరిదీ ఒకే అభిమతం — అదే మానవసేవ.

ఎక్కడో స్మశానానికవతల కాబోలు నక్క వూళవేసింది. అకస్మాత్తుగా సాయంత్రం చూసిన దృశ్యం కళ్ళముందు నిలిచింది పావనమూర్తికి. దేవుడిచ్చిన శాపం కోటయ్య దంపతులకెంత కడుపు శోకాన్ని తెచ్చింది ! ఏ జాతి వారైనా; ఏ మతంవారైనా ఏ కులంవారైనా దుఃఖం అందరికీ సమానమేగదా. అయితే సుఖంలోనే అన్ని తేడాలూ. ఈ జాతి మతాలూ, హెచ్చు తగ్గులూ, ఆర్థిక అసమానతలూ మనుషుల విలువల్నీ మంచితనాల్నీ కప్పిపుచ్చి అర్థంలేని అడ్డుగోడలు కడుతున్నాయి. కాకపోతే యేమిటి ? ఈ కడ జాతి అనుకున్నవాళ్ళని తక్కువకులం దేవుడు సృష్టించాడా ? ఈ సంఘం వాళ్ళనట్లా ఎందుకు వేరు చేసినట్లు ? అంటరానివారిగా ఎందుకు వెలివేసినట్లు ? మరి వారి రక్తంలో తక్కువయిందేమిటి ? ఎరుపుదనమా ? వెచ్చదనమా ? బలమా ? చైతన్యమనుకునే ఎరుధుతిరిగే శక్తా ?

తన తలలో మెదుల్తున్న ఆలోచనలకు తనే ఆశ్చర్యపోయాడు పావనమూర్తి. ఇదే విషయం లోగడ ప్రస్తావనకొస్తే చక్రధరం అన్నాడు.

''ఒకప్పుడు వారిని బాగా అణగద్రొక్కేసింది నిజమే — ఊరివాళ్ళకి వారు ఎదురుపడకూడదు. గుళ్ళోకి వెళ్ళకూడదు — చివరికి వూరి బావిలో నీళ్ళుకూడ తాగకూడదు -- కానీ యీ ఆంక్షలన్నీ ఎప్పుడో పోయాయి. ఇప్పుడు వాళ్ళు వాళ్ల జీవితాల్ని సుఖమయం చేసుకోవడానికీ, దిద్దుకోడానికీ ఎన్నెన్నో అవకాశాలు ఏర్పడ్డాయి — వారిలో వున్నతినికోరే ప్రతివారికీ విద్య ఉద్యోగ సౌకర్యాలు కలుగుతున్నాయి.''

''ఆ మాటకొస్తే అగ్రకులాల వారికంటె వారికే సదుపాయాలెక్కువగా కలుగుతున్నాయి నాన్నగారూ. ఈ ప్రజాస్వామ్య దేశంలో కులమత రహిత సంఘం ఏర్పడకపోయినా సమానత్వాన్ని పెంపొందించి ఆర్థిక అసమానతల్ని తొలగించే ప్రయత్నాలు బాగానే జరుగుతున్నాయి'' అంది వసంత.


''మరి యింకా యీ గ్రామాల్లో వెలివేసినట్లుండే వారి గుడిసె లేమిటమ్మా'' అన్నాడు తను కల్పించుకుని.

''సంస్కారమన్నది రక్తంలోంచి వస్తుందంటారుగా. అలాగే వివక్షత అనేది మనిషి ఆలోచనల్లోంచి రావాలి. ప్రభుత్వ ఉత్తరువుల్లోంచి రాకూడదు. ఏమైనా మనిషిని మనిషిగా గౌరవించడం, సమానత్వాన్ని సాధించడం విజ్ఞానం విశేషంగా పెరిగిన యీ రోజుల్లో అత్యవసరమే అయితే నమానత్వమంటూనే నీదే కులమని అడగటం, నీ కులానికీ అవకాశం లేదనటం విడ్డూరంగా తోస్తోంది.''


చక్రధరం మాటలకు వసంత మధ్యలోనే అడ్డుతగిలింది.

''అణగదొక్కబడ్డవారికి చేయూతనివ్వడం అన్నిరంగాల్లోనూ అవకాశాలు కల్పించడం సబబే. కానీ పక్షపాత వైఖరి చూపినన్నాళ్ళ సమానత్వమన్నది మనం అందుకోలేనంత దూరంలోనే 'హార్జైజాన్' లా వుండిపోతుంది.''

అప్పట్లో ఆ విషయాన్ని గురించి యిక పొడిగించదల్చుకోలేదు. అధోగతిపాలౌతున్న ఒక జాతి పట్ల జాలిపడే తమతరం ఆలోచనలు వేరు. వారికి కల్పించిన అవకాశాల వల్ల తమకేదో



# ఇవేమన పద్యాలు




ఉన్నసరికి మనుజుడుపకారి కాలేడు
కన్నుగాన కిలన గర్వమునను
దీనులైనవారి దిగువ యెగువ జూచి
పరముగనక నూతబడును వేమ.

అన్యాయం జరిగిపోతుందన్న యీ తరం వారి ఆలోచనలు వేరు. బహుశ యీ రెంటికే పొత్తు కుదరకపోవచ్చు. చక్రధరానికి ఉద్యోగం రాకపోడానికీ, వసంత భర్తకు ఉద్యోగంలో ఎదుగూ బొదుగూ లేకుండా వుండిపోడానికీ యీ పక్షపాత వైఖరే కారణమని వారి వాదన.



## రేపటి వెలుగు

నిట్టూర్చేడు పావనమూర్తి.

గదిలో యేదో అలికిడైతే లేచి అటు వెళ్లాడు. గుడ్డిదీపమైనా గదిలో బంగారు రంగు వెలుగు! తన దృష్టిని మనుషుల మీదికి మళ్లించాడు. దీపం కాంతి ఒకరిపీదే స్పష్టంగా పడుతోంది. తన చిన్న కాళ్ళనూ చేతుల్నీ కదిలిస్తున్నాడా పసికందు. నిద్రలోనే ఆ ముఖంలో ఏదో వెలుగు!

పావనమూర్తి వదనంలో ఆనందరేఖలు పొడచూపాయి. ఆ వెంటనే విచార రేఖలూ అలుముకున్నాయి, పాతికేళ్లనాడు మహాలక్ష్మి పొత్తిళ్లలోని చక్రధరం అతని కళ్లముందు నిలిచాడు. చిన్నతనంలో చదువుకున్న 'పుత్రోత్సాహము తండ్రికి' అనే పద్యం కూడ గుర్తుకొచ్చింది.

తన వంశం నిలబడింది. కానీ ఏ స్థాయిలో నిలబడింది? జీవనపోరాటంలో విసిగి దేశాల పాలయ్యాడు చక్రధరం. తిరిగి జ్ఞానవంతుడై యే బుద్ధుడిలా తిరిగొస్తాడో... లేదా ఏ అమర వీరుడిలా అదే పోరాటంలో అస్తమిస్తాడో వూహాకందటం లేదు.

మరి యీ రెండు వంశాంకురాలూ పెరిగే దెప్పుడు?

కోటి తేజో ప్రభాకరులైన వెలుగులు ప్రసరించేదెప్పుడు?

తనలోని జీవుడు ఆరిపోయాక ఏ వెలుగు కిరణం యీ జీవాలకు దారి చూపిస్తుంది?— అన్నీ ప్రశ్నలే!

బయటినించి గాలి జోరుగా వీచింది. పావనమూర్తి కళ్ళు వర్షిస్తున్నాయి. గుండెలు వుద్వేగంతో ఎగిరిపడుతున్నాయి. పదునుదేరిన ఆలోచనలు మెదడును కోసేస్తున్నాయి.

అనుకోని గాలి తాకిడికి అష్టవంకరలూ తిరిగి చివరికి నిలదొక్కుకుంది గదిలోని గోరంత దీపం.

అదే సమయంలో పావనమూర్తి మెదడులో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. అది పాపమా? పుణ్యమా? స్వార్థమా? జీవన పోరాటంలో అంగీకరించిన ఓటమా?

ఎన్ని ప్రశ్నలెదురైనా వాటికి జవాబుల కోసం ఆలోచించదల్చుకోలేదు. మనోధైర్యంతో అడుగు ముందుకు వేశాడు.

అడుగులు ముందుకు పడుతూనే వున్నాయి!

చీకటిలో... ముళ్ళదారిలో... ఎత్తుపల్లాలలో— నేల నాలుగు చెరగులా ఆనినట్లు ఒక్కో పాదం అతి బరువుగా... నిర్భయంగా. అవి కంసుడి పాలబడకుండా ధర్మాన్ని రక్షించే ప్రయత్నంలో అలనాటి నిశరాత్రి యమునను దాటే వసుదేవుడి పాదాలు కావొచ్చు. అధర్మాన్ని అంతం చేసే వామన పాదాలు కావొచ్చు! వివక్షతల అగాధాలను దాటే యీనాటి సామాన్యుడి పాదాలు కావొచ్చు!

* * *

తెల్లవారింది— కోటి ప్రభలతో సూర్యుడుదయించాడు. లోకమంతా వెలుగు—ఊరిలోనూ వాడలోనూ అదే వెలుగు— మాతృమూర్తి జానకి వదనంలోనూ; శాపగ్రస్త అయిన కోటయ్య భార్య ముఖంలోనూ ... ★